

# అగ్రహారం కథలు

## వేదుల సుభద్ర



పేరులో ఒక రకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరి దేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశికగా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచార వ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచి చూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - ***రచయిత్రి(బెంగుళూరు)***

# *ఊరు మారెనా??*

**విమానం ఇంకా దిగలేదు గనక** సీట్లో కూర్చున్నాడు కానీ లేకపోతే ఆ నిమిషంలో హరిని ఆపడం కష్టంగా ఉంది. మెడ కొంగలా చాపి కిటికీలోంచి కనిపించినంత మేరా కింద నేల మీదకి చూస్తున్నాడు. హరికి ఇరవైఏడేళ్ళు.. అమ్మా, నాన్నలతో హైదరాబాద్‌లో ఉంటూ పన్నెండో క్లాస్ తర్వాత సాట్ పరీక్ష రాసి చదువుకని అమెరికా వెళ్ళినవాడు, మళ్ళీ ఇన్నేళ్ళకి ఇప్పుడే తిరిగ్గా రావడం. మధ్యలో ఒకసారి వచ్చినా పట్టుమని పదిరోజులు కూడా ఉండలేదు. అందువల్ల ఇంట్లో గడిపాడే తప్ప బయటకి ముఖ్యంగా అగ్రహారానికి అదీ వెళ్ళనేలేదు.

బి.ఎస్, ఎం.ఎస్ అయ్యి ఉద్యోగం దొరకడం ఒక ఎత్తయితే, వాటికి తగ్గట్టు వీసాల మార్పులూ, మధ్యలో అడ్డుపడ్డ నియమాలూ, ఆర్థిక పరిస్థితులూ అన్నీ కారణాలే.. ఎలాగైతేనేం.. ఇప్పుడు ఇన్నాళ్ళకి ఇలా రావడం కుదరడం వల్ల అతనికి గాల్లో తేలుతున్నట్టు ఉంది.. నిజంగానే గాల్లో తేలుతున్నాడు అది, వేరే విషయం.

హైదరాబాదులో ఉంటున్న అమ్మా నాన్నలని చూసి, అక్కడే మరో రెండు రోజుల్లో జరగబోతున్న మావయ్య కూతురి పెళ్ళి అయింతర్వాత అక్కడనించి అందరితో కలిసి అమ్మమ్మగారి ఊరైన అగ్రహారానికి వెళ్ళి కనీసం వారం రోజులైనా ఉండాలనేది అతని సంకల్పం. అమ్మ కూడా తనతోనే వస్తానంది కూడానూ.

"అమ్మా, నాన్నా ఎలా ఉన్నారో? మధ్యలో ఒక్కసారి వచ్చారు వాళ్ళు అది కూడా నాన్నకి సెలవు లేదని ఆరువారాలుండి వెళ్ళిపోయారు.

నేనైతే మూడు వారాలకి మించి ఉండలేను.. మీరే వస్తే కనీసం మూడు నెలలుండవచ్చు" అంటే అదీ వాళ్ళు చేసింది.

"అమ్మమ్మ ఎలా ఉందో? తాతగారు ఎలా ఉన్నారో? అసలు మావయ్య కూతురు సుమ పెళ్ళి ఊర్లో కాక ఇక్కడెందుకు చేస్తున్నారో?" ఇలా రక రకాల ఆలోచనలు.

' సీట్ బెల్ట్ లు పెట్టుకోండి' అన్న మాట వినబడగానే బుద్ధిగా స్కూల్ పిల్లాడిలా పెట్టేసుకున్నాడు. విమానం ఒక్కో అడుగూ కిందకి దిగుతూ ఉంటే అతని మనసు ఆనందంతో పైకి తేలుతోంది. విమానాశ్రయంలో దిగి ఒక్క క్షణం నిలబడిపోయాడు.

తను చూసిన అంతర్జాతీయ విమానాశ్రయాలలాగానే ఉంది ఈ మధ్యనే కట్టిన హైదరాబాదు విమానాశ్రయం.

'ఓహ్! పరవాలేదే? ' అనుకున్నాడు చిత్రంగా కళ్ళూ, భుజాలూ ఎగరేస్తూ. ' పెట్టెలూ తొందరగానే వచ్చేసాయి' అనుకున్నాడు.

గేటు దగ్గర తనకోసమే ఎదురుచూస్తున్న అమ్మా, నాన్నా, పెద్దమావయ్యా, పక్కనో అమ్మాయి.

' ఈ అమ్మాయి ఎవరబ్బా? కొంపదీసి సుధ కాదు కదా, అలాగే ఉంది.. మావయ్య కూతురు, పెళ్ళి కూతురి చెల్లెలు.. సుధ. '

హరిని చూసి అందరూ ఆనందంతో చేతులూపారు. దగ్గరకు రాగానే కౌగలించుకుని ఒక పట్టాన వదలలేదు అమ్మ.

నాన్న కూడా మనసారా అక్కున చేర్చుకుని కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు.

మావయ్య ముఖంలో అదే చిరునవ్వు ఇన్నేళ్ళయినా మార్పు లేదు. " బావున్నావురా?" అన్నాడు, " పెద్దవాడవయిపోయావు " అంటూ తల నిమిరాడు.

" హాయ్ హరి బావా! వెల్కం టూ మదర్ లాండ్ " అంది సుధ.

" మన సుధరా" అంది అమ్మ వనజ జీన్స్, కుర్తాలలో ఉన్న అమ్మాయిని చూపిస్తూ.

అవునా, అన్నట్టు చూసాడు. ' హలో' అంటూ.

" ఈ మధ్యన హైదరాబాద్ బాగా మారిందిలేరా.. మరీ అంత ఆశ్చర్యపోకు రోజూ చూస్తున్నా మాకే ఏదో ఒకటి కొత్తగా కనిపిస్తూనే ఉంటుంది " అన్నారు హరి వాళ్ళ నాన్న. " ఈ ఫ్లై ఓవర్ లూ, మాల్సూ, ఇంత మారిపోయిందా? " అని చూస్తున్న హరితో. సుధ పెదవులమీద విరిసీ విరియనట్టుగా తళుక్కుమన్న చిరునవ్వు హరి దృష్టిని దాటలేదు.

" ఒహో, పిజ్జా హట్, పిజ్జా కార్నర్ ఇవన్నీ ఉన్నాయా హైదరాబాద్‌లో? " స్వగతంగా అనుకున్నట్టే పైకి అనేసాడు. మావయ్య నవ్వేడు.

" ఇంకో రెండేళ్ళు పోతే మన అగ్రహారనికి కూడా వచ్చేస్తాయేమోరా, ఈ గుడిసెలూ, మూలలూ " అన్నాడు నవ్వుతూ. " అవునా? " అని వింటూ ఉండి పోయాడు. సుధ ఈ సారి ఫక్కున నవ్వింది.

రెండు రోజుల్లో పెళ్ళి ఉండడంతోనూ, పెళ్ళివారంతా ఇక్కడే దిగడంతోనూ హరి వాళ్ళ ఇల్లంతా ఎంతో సందడిగా ఉంది. అనుకోకుండా పక్క ఫ్లాట్ ఖాళీ అవడంతో పదిహేనురోజులకని చుట్టాల కోసం అది అద్దెకు తీసుకున్నారు. ఇంక రెండు ఇళ్ళల్లోనూ చెప్పలేనంత సందడి.

"పెళ్ళిహాలు ఇక్కడికి దగ్గరే, అందుకే అందరినీ నాలుగు రోజులు ముందే రమ్మన్నాను.. ఎన్నేళ్ళయిందో అందరం కలిసి" అంది అమ్మ హరి చెయ్యి పట్టుకుని పేరుపేరునా అందరికీ పరిచయం చేసింది. పలకరింపులూ, పరిచయాలు పూర్తి అయ్యాకా, చల్లని నీళ్ళతో ముఖం కడుక్కుని వంటింట్లో గట్టు మీదెక్కి కూర్చున్నాడు అమ్మ ఇచ్చే కాఫీ కోసం.

"నీ అలవాటు ఇంకా మానలేదురా నువ్వు? " అంది ఎక్కడనించి వచ్చిందో అమ్మమ్మ.. "చిన్నప్పుడూ ఇలాగే బూస్ట్ కోసం కూర్చునేవాడివి" అంటూ.

"అవునమ్మమ్మా పెళ్ళి చక్కగా మన ఊళ్ళో చెయ్యవచ్చు కదా, ఇక్కడెందుకు? "అన్నాడు .

"సరేలే.. అలాగే.. ఇప్పుడా పాతకాలపు పద్దతులూ, పల్లెటూరి వ్యవహారాలు ఎవరికి నచ్చుతాయిరా? అందుకే ఇక్కడ." అందావిడ నిట్టూరుస్తూ.

"మగపెళ్ళివారు ఇక్కడైతే బావుంటుంది, వాళ్ళవాళ్ళందరికీ కూడా ఇదే వీలు అన్నారు బాబూ, లేకపోతే మీ మావయ్యకీ, అమ్మమ్మకీ కూడా అక్కడే చేద్దామని ఉంది. "అంది అప్పుడే వచ్చిన పెద్దత్తయ్య.

"మన ఇల్లైతే, మన ఊరైతే అదో గౌరవం, పద్దతీ, ఇక్కడకి వచ్చి ఏదో పరాయి ఊర్లో పెళ్ళి చెయ్యడం అంటే మాటలా? అక్కడకీ మీ అమ్మ ఉంది కనక ఈ మాత్రమైనా ఉంది " అంది అమ్మమ్మ వెంటనే. హరి వింటూ ఉండిపోయాడు.

పెళ్ళికి మూడు రోజుల ముందునించీ చేసిన వంట చెయ్యకుండా పెళ్ళివారందరికీ వడ్డిస్తున్న కేటరింగ్ వాళ్ళనీ, పెళ్ళి జరిగిన రెండు రోజులూ రాత్రి కూడా పట్టపగలుని తలపిస్తూ మెరిపిస్తున్న దీపాల అలంకరణనీ, పెళ్ళిలో ఆడవాళ్ళు పెట్టుకున్న నగలనీ, కట్టుకున్న పట్టుచీరలనీ, స్టేటస్‌లూ, హోదాలూ, జీతాలూ, విదేశీ ప్రయాణాలగురించీ పకుండా మాట్లాడుకుంటున్న మగవారినీ స్టేజికీ, హాల్ కీ జరిగిన అలంకరణలనీ, పెళ్ళి చూడనివ్వకుండా కనీసం ఆశీర్వదించే చేతులు కూడా అడ్డు రాకూడదని అందరినీ అదిలిస్తూ స్టేజ్ అంతా తామే క్రమించుకుని తిరుగుతున్న ముగ్గురు వీడియోగ్రాఫర్‌లనీ, ఎంతో వింతగా చూసాడు హరి.

తనకి బాగా తెలిసి అగ్రహారంలో జరిగినపెళ్ళి పిన్నిదీ, చిన్న మావయ్యదీ. ఇద్దరి పెళ్ళిళ్ళకీ నాలుగు రోజులు తేడా. ముందు ఆడపిల్ల పెళ్ళి ఇక్కడ తమ ఇంట్లో చేసి అప్పగింతలు పెట్టి తర్వాత చిన్న అత్తయ్య వాళ్ళ ఊరు వెళ్ళారు, మావయ్య పెళ్ళికి..

అదయ్యాకా మళ్ళీ అందరినీ అగ్రహారం తీసుకుని వచ్చి సత్యనారాయణ వ్రతమూ, భోజనాలు.. ఇలా మొత్తమ్మీద పది రోజులకి పైగానే హడావుడి.

అప్పుడు పదేళ్ళుంటాయేమో హరికి.. పదిహేడేళ్ళు గడిచినా ఇప్పటికీ జ్ఞాపకాలు పదిలంగా ఉన్నాయి అతని మనస్సులో.

' ఈ రోజే స్కూల్ కి ఆఖరి రోజు.. రేపటినించీ వేసవి సెలవులే' అని ఎగురుకుంటూ స్కూల్ నించి వచ్చారు హరి, తమ్ముడు వాసు.

వచ్చేసరికి చేతిలో ఉత్తరమూ, వెలిగిపోతున్న ముఖంతో అమ్మ వనజా కనిపించారు వాళ్ళకి.

అంతే కాదు రాగానే " మీ పిన్నిదీ, చిన్నమావయ్యదీ పెళ్ళి, తాతగారు మనందరినీ పదిరోజులు ముందే రమ్మని రాసారు" అని అమ్మ ఆనందంగా చెప్పింది.

నాన్న పాపం పది రోజులు ఎక్కడ తింటారన్న ఆలోచన అయినా లేకుండా, వాళ్ళు ముగ్గురూ ప్రయాణం కట్టేసారు..

"పెళ్ళికి కనీసం రెండు రోజుల ముందయినా రావాలి మీరు, లేకపోతే బావుండదు.. ఒక వారం సెలవు పెట్టండి" అని అమ్మ చెప్పేసి వాళ్ళిద్దరినీ తీసుకుని బస్సెక్కేసింది.

అక్కడ ఉంది హడావుడి.. చూడాలి.

పచ్చి ఆకుల వాసనతో పచ్చగా మెరుస్తున్న పందిళ్ళూ, నున్నగా, ఆకుపచ్చగా పేడనీళ్ళతో అలికిన వాకిళ్ళూ, దానిమీద తివాచీలూ, శివుడి మూడో కన్నూ, దీపాలూ, ప్రమిదలూ, గోకర్ణాలూ ఇలా రకరకాల పేర్లతో ముత్యాలు పేర్చినట్టున్న తెల్లని ముగ్గులూ, కొత్త సున్నపు వాసనతో ఘుమఘుమ లాడుతున్న ఇల్లూ, పచ్చటి రంగులు వేసుకున్న గడపలూ, అన్నీ ఒకటే మెరిసిపోతున్నాయి.

అంతేనా? బంధువులకోసమని అటకల మీదనించి దింపిన పట్టెమంచాలూ, వాటికి బిగించిన చాకలి సోడా వేసి వేడినీళ్ళల్లో ఉతికి ఆరేసిన నవారూ, పెరట్లో కాసిన బూరుగుదూది తో పట్టులా, మెత్తగా కుట్టించిన కొత్త తలగడలూ.. గంజి పెట్టి ఉతికి ఆరేసిన దుప్పట్లూ ఇటు అమ్మమ్మగారింట్లోనూ, అటు విడిదింట్లోనూ కూడా ఒక్కటే రకంగా ఉన్నాయి. అందులో కొన్ని ఊరిలో వాళ్ళ ఇళ్ళల్లోంచి వచ్చినవి.. పెళ్ళి మీ ఇంట్లోనా , మా ఇంట్లోనా అని అనుకోరుట వాళ్ళెవ్వరూ.. మన ఊరిలోనేకదా అనుకుంటారుట.

పెళ్ళికొడుకుకని ప్రత్యేకంగా వేయించిన పందిరి పట్టె మంచం అయితే చెప్పక్కర్లేదు. అచ్చు చందమామ కథల్లో రాసినట్టు హంసతూలికా తల్పంలాగే ఉంది. దాని మీద ఎక్కుదామని చూసిన హరి , వాసుల పాచిక పారలేదు..

" తప్పు, దానిమీద మీ బాబాయ్ తప్ప ఎవ్వరూ పడుకోకూడదు, మాసిపోతుంది " అని అమ్మ తీసుకుని వచ్చేసింది.

" ఎంత బావుందో ! తెల్లటి దుప్పటీ పరిచిన ఆ మంచం, దానిమీదకి ఎక్కడానికి కింద అమర్చిన స్టూల్ కూడా బావుంది. "

ఎంతో పద్దతిగా, నిదానంగా మేళతాళాలతో, సమయానికి తగ్గ మంత్రాలతో వేదనాదాలతో జరిగాయి వేడుకలు.

వినాయకుడిని పెట్టి పెళ్ళి పనులు ప్రారంభించడం దగ్గరనించీ, పసుపు కొట్టి పెళ్ళి కూతురిని చెయ్యడం, అంకురార్పణా, గౌరీపూజా, పెళ్ళి, నాగవల్లి, అప్పగింతలూ ఇలా అన్నీ.

ప్రతీ వేడుకకీ తగ్గట్టుగా, తగినట్టుగా వంటలూ, పిండివంటలూ శుచిగా రుచిగా చేసిన వంట బ్రాహ్మలూ, తమ ఇంట్లో పెళ్ళి అన్నంతగా ఎంతో ప్రేమగా, కొసరి కొసరి వడ్డించిన ఊరివారూ..దాదాపు పదిరోజులూ ఊరిలో అందరూ ఇక్కడే భోజనాలు చేసారు. చాలా మంది తమతో పాటు బళ్ళెక్కి చిన్న మావయ్య పెళ్ళికి వచ్చారు కూడా. ఇంట్లో వారితో పాటే వారితో సమానంగా ఉన్నవాళ్ళందరూ పక్కిళ్ళవాళ్ళని ఎవరికీ అనిపించేదే కాదు. ఇవన్నీ హరికి అప్పుడు అంతగా తెలీలేదు కానీ పెరుగుతున్న వయసూ, ఎదుగుతున్న మనసూ.. వేడుకలనీ, వాటివెనక ఉన్న ఆ చారవ్యవహారాలనీ, అలాంటి చిన్నఊర్లలో అంతర్లీనంగా పెనవేసుకుని ఉండే బంధాలనీ తెలియ చెప్పాయి.

ఈ రెండు పెళ్ళిళ్ళలోనూ అతనికి అప్పటికీ, ఇప్పటికీ ఎంతో బాగా గుర్తున్నది ముత్యాల పల్లకీ.. ముందు పిన్నీ, బాబాయ్‌లు ఎక్కారు .. నాలుగు రోజుల తర్వాత చిన్న మావయ్యా, అత్తయ్యా ఎక్కారు.

‘ అదెంత బావుందో! దాని తొట్టిలో మెత్తటి పరుపు వేసారు, దానిమీద పాలనురుగులాంటి తెల్లటి దుప్పటీ పరిచారు, రెండు వైపులా రెండు దిండ్లు పెట్టారు.

తర్వాత పల్లకీ మీద ఒక వైపుబొమ్మలూ, మరొక వైపు ఎర్రటి రంగూ ఉన్న చక్కటి గుడ్డ బిగించి కట్టారు.. అప్పుడు దాని రెండు కొమ్ములనీ కలుపుతూ ముత్యాల సరాలు వేళ్ళాడ దీసారు. ఎంత బావుందో అది జిగేల్ మంటూ మెరిసిపోతూ.

రెండు ఊర్లలోనూ ఊరేగింపు ఎంత బాగా జరిగిందో, ఊరేగింపు అనాలిట. అమ్మ చెప్పింది. పల్లకీకి ముందూ వెనకా మనుష్యులు పెట్రోమాక్స్ లైట్లు పట్టుకుని నడుస్తూ ఉంటే ఆడవాళ్ళు వెళ్ళి లడ్డూలూ, మినపసున్నీ వగైరాలు అందరికీ పంచడం.

ప్రతీ ఇంటి దగ్గరా ఆగడం, బేండ్ వాళ్ళు ఒక పాట వాయించడం, ఇంట్లో పెద్దవారెవరైనా ఉంటే పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురినీ లోపలకి తీసుకుని వెళ్ళి వారికి దండం పెట్టించడం‘

ఇలా .. అన్నీ హరి కళ్ళకి కట్టినట్టు తిరుగుతున్నాయి.

ఆ పెళ్ళికీ, ఈ పెళ్ళికీ పోలికే లేదు అనుకోకుండా ఉండలేకపోయాడు.

ఆ పదిరోజుల సంబరానికీ, ఈ పదిగంటల హడావుడికీ పొంతనే లేదు.. అనుకున్నాడు అక్కడ జరుగుతున్న ఆర్భాటాన్ని చూస్తూ.

తెల్లారుఝామున పెళ్ళిట.. అందుకని ఆర్కెస్ట్రా పెట్టించారు. వాళ్ళు ఈ మధ్యన వచ్చిన సినిమా పాటలుట. పాడుతున్నారు. అతిథులందరూ వచ్చేసారు. పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ రాలేదు ఇంకా. మేకప్ పూర్తి అవ్వలేదుట. దాదాపు అరగంట ఆలస్యంగా వచ్చారు వాళ్ళు స్టేజ్ మీదకి. వాళ్ళు రాగానే అందరూ గట్టిగా చప్పట్లు కొట్టారు, కొందరు కుర్రాళ్ళైతే ఈలలు కూడా వేసారు ఎందుకో మరి.

ఇంక అక్కడనించీ రష్ మొదలు.. ప్రతీవారూ స్టేజ్ ఎక్కడం, వారితో ఫోటోలు తీయించుకోవడం, అటునించి అటే భోజనానికి వెళ్ళడం. భోజనాల పేరున అక్కడ పేర్చిన పదార్థాలతో ఓ నాలుగు అగ్రహారాలకి భోజనాలు పెట్టవచ్చు అనుకున్నాడు. ఎనిమిదింటికి ప్రారంభమయిన ఈ కార్యక్రమం దాదాపు పదకొండింటివరకూ సాగుతూనే ఉంది.

అప్పటికి జనం పలచబడ్డారు. అందరూ వెళ్ళిపోవడంతో ఆశ్చర్యపోతూ అత్తయ్యని అడిగాడు. అదేమిటి? వీళ్ళందరూ పెళ్ళికి ఉండరూ? మళ్ళీ వస్తారా? అని..

"ఇంకేం వస్తారు? తెల్లవారుఝామున పెళ్ళిళ్ళయితే కేవలం ఇంట్లో వాళ్ళే ఉండేది.. " అంది నవ్వుతూ.

"ఓహో అలాగా! మరి ఇదివరకు అలా ఉండేది కాదుగా? "అన్నాడు.

నవ్వింది అత్తయ్య. " ఆ రోజులు వేరయ్యా, నీకు గుర్తుందా మా పెళ్ళికి మన అగ్రహారంలో ఎంతమంది వచ్చారో? ఈ రోజుల్లో కేవలం కార్డ్ ఇచ్చి పిలిచినందుకు వచ్చి టిక్ వేయించుకున్నామా లేదా అన్నదే ముఖ్యం అంతే.. " అంది.

ఎప్పుడు వచ్చిందో తెలీదు కానీ పక్కనేనిల్చున్న సుధ కూడా ఈ సారి పెద్దగానే నవ్వింది.

"మన అగ్రహారంలో పెళ్ళి చేసుంటే ఎంతో బావుండేది. అక్కడిలా ఉండదు నాకు తెలుసు " అన్నాడు చిన్నగా.

అలా అంటూనే సుధని చూసి అడిగాడు..

"నేను వచ్చినప్పటినించీ చూస్తున్నాను.. నేనేం అడిగినా చిన్నగానో పెద్దగానో నవ్వుతున్నావు? ఏంటి విషయం?" అని. సుధ మాట్లాడలేదు. నవ్వుతూ వెళ్ళిపోయింది.

పెళ్ళి అయిన మూడోరోజున పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ, సింగపూర్ హనీ మూన్‌కి వెళ్ళిపోయారు. మిగతా పెళ్ళివారందరూ అగ్రహారానికి తరలారు.

'వావ్ సింగపూర్‌కి హనీమూన్, నాట్ బాడ్, ఐ హర్డ్ దట్ సింగ్ ఎయిర్ ఈజ్ ద బెస్ట్' అని.. అని వాళ్ళతో అని తను తెచ్చిన బహుమతి ఇచ్చి వాళ్ళకి శుభాకాంక్షలు అందచేసాడు.

అతనికి ఈ పెళ్ళి కంటే అగ్రహారం ఎప్పుడెప్పుడు చూద్దామా అని ఉత్సాహంగా ఉంది. అంతకంటే ముందు బంధువులందరితో కలిసి ప్రయాణం చెయ్యడమూ చాలా సరదాగా ఉంది కూడా..

'అగ్రహారం ఎలా ఉందో?

తను చిన్నప్పుడు కలిసి ఆడుకున్న వాళ్ళు ఎలా ఉన్నారో ?

అమ్మమ్మవాళ్ళ పొలం ఎలాఉందో?

బండి ఉందో లేదో?

దాన్ని లాగే రాముడూ, లక్ష్మణుడూ, బండి పక్కనే ఉన్న పుల్లనారింజకాయ చెట్టూ, దాని త్వొరలోనే తాముదాచుకునే ఉప్పూ కారం, తోటలో ఉన్న తిరపడి నుయ్యూ.. అమలాపురం గడియారం స్థంభం ఇలా ఒకదాని తర్వాత ఒకటి గుర్తుకొస్తున్నాయి.

వాటన్నింటినీ, ఊరివారినీ అందరినీ ఎప్పుడు చూస్తానో? అనుకుంటూ ఉండగానే రైలు కదిలి రాజమండ్రీ వైపు పరుగు తీసింది.

ముగింపు వచ్చే సంచికలో

***

Click here to share your comments on this article